క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.6.07 లక్షలు



సొమ్ములను లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది, అధికారులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో హుండీలను సోమవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించగా ఏడు నెలలకు గాను రూ.6,07,574 ఆదాయం లభించినట్టు ఈఓ టీవీ సూర్యనారాయణ తెలియజేశారు. దేవదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్రకుమార్, ఈవోలు వీరభద్రరావు, వేణుగోపాలరావు పర్యవేక్షణలో గ్రామస్తులు, భక్తులు, సిబ్బంది ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హుండీల్లోని ఆదాయం లెక్కించినట్టు ఆయన తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: నిట్ కాలికట్ నిర్వహించిన ఇన్ఫినిటమ్ పోటీల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ చూపారు. గంగరాజునగర్ ఉన్నత పాఠశాల పదో తరగతికి చెందిన మానెజె సమర్థ, మన్యం సాయిఅభినవ్ ప్రతిభ సాధించి 25వేల నగదు బహుమతిని సొంత చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ నల్లమిల్లి దీపక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మొయినాలు సోమవారం అభినందించారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి



గృహోపకరణాలను అందజేస్తున్న వెంకటేశ్వరరావు

బాలాజీచెరువు: ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని హెల్ప్ అవేర్‌నెస్ సంస్థ అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరావు పేర్కొన్నారు. అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ పెంకే గోవిందరాజు ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో భాగంగా రజనీగౌరి అనే మహిళలకు గృహోపకరణ వస్తువులు అందజేశారు. పేద కుటుంబానికి చెందిన మహిళలకు వివాహ నిమిత్తం సాంప్రదాయంగా పెట్టే గృహోపకరణ వస్తువులు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సౌత్ ఇండియా మల్టిపుల్ కౌన్సెల్ కార్యదర్శి వనుం శ్రీనివాసరావు, క్యాబినెట్ కార్యదర్శి పెంకేశివప్రసాద్, కాకరపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీసీ పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన

కాకినాడ క్రైం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై సోమవారం నుంచి అవగాహన వారోత్సవాలు ప్రారంభించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. విద్యార్థినులకు ఈ చట్టంపై లోతైన అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. జిల్లా టీకాల అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు కార్యక్రమ ఉద్దేశాలను వివరించారు. చట్టం పటిష్టంగా అమలు చేస్తుండడం వల్ల జిల్లాలో లింగ ఆధారిత గర్భపాతాలు నివారించవచ్చన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3365 లేదా 94941 13365 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో నాని ప్రతిభ



స్విమ్మింగ్‌లో పతకాలు సాధించిన నాని

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మంగళగిరిలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన 7వ మాస్టర్స్ మహబూబ్ షంషేర్ ఖాన్ స్మారక స్విమ్మింగ్ పోటీల్లో కాకినాడకు చెందిన స్విమ్మింగ్ క్రీడాకారుడు నాని ప్రతిభను కనబర్చారు. 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్‌లో బంగారు, 50 మీటర్ల బటర్ ఫ్లై లో రజత, 50 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకాలు సాధించాడు. ఈపోటీల్లో తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, ఏపీ నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని నాని తెలిపాడు.



వినతిపత్రం ఇచ్చేందుకు ఎక్సైజ్ స్టేషన్‌కు వాన నీటిలో వెళుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు తదితరులు



కాకినాడలో నిరసన తెలుపుతున్న కన్నబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు



కాకినాడ ఎక్సైజ్ డీసీ కార్యాలయం వద్ద గేటు వేసి ఉండడంతో వినతి పత్రం ఇచ్చేందుకు వేచి ఉన్న కన్నబాబు తదితరులు

ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

- కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్ కన్నబాబు
- నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉద్యమం
- కాకినాడలో నిరసన ర్యాలీ
- ఎక్సైజ్ ఏసీ రేణుకకు వినతిపత్రం అందజేత



కాకినాడలో కన్నబాబు నాయకత్వాన నిరసనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ, విక్రయాలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకోమని కాకినాడలో రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటరు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ, విక్రయాలకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కాయి. ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ప్రజల పక్షాన నిలిచి ఉద్యమ బాట పట్టాయి. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కాకినాడలో కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొన్నాయి. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో బయలుదేరిన కన్నబాబు నాగమల్లితోట జంక్షన్ వద్ద ఐదు బిల్డింగ్‌ల ప్రాంతంలోని ఎస్వీ రంగారావు విగ్రహం నుంచి ఎక్సైజ్ డీసీ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. నకిలీ మద్యం తయారీ, బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా నిరసనలు తెలియజేస్తూ ర్యాలీలో నినాదాలు హోరెత్తించారు. అనంతరం ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద తాళం వేసి ఉన్న గేటు వద్ద కొద్దిసేపు నిరసన తెలియజేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖ ఏసీ రేణుకకు వినతిపత్రం అందజేశారు. నకిలీ మద్యం విక్రయాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిరసన చేపట్టామని, ప్రభుత్వానికి తమ వినతిని పంపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. గత ప్రభుత్వంలో జే బ్రాండ్ అని పచ్చ మీడియాతో ప్రచారం ఊదరగొట్టారని, ఇప్పుడు నకిలీ మద్యం ఏ బ్రాండ్ అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుకోవద్దని హితవు పలికారు. కుటీర పరిశ్రమగా కల్తీ మద్యం తయారీని మార్చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురామ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, పార్టీ ఎస్ఈసీ సభ్యులు బెజవాడ సత్యనారాయణ, గోపుశెట్టి బాబ్జీ, సరోజ, మాకినీడి శేషుకుమారి, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కరీం బాషా, ప్రచార విభాగం జిల్లా ప్రెసిడెంట్ పి.నాగబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి గణేష్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివకుమారి, పార్టీ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, తోటకూర శ్రీనివాస్, నల్ల రాణి, భవాని, పంతం ఇందిరా, నేమాం సర్పంచ్ జాన్ ప్రభాకర్, ఎంఎస్ఎన్, సంగాడి మోషే, ఐ.శ్రీను, కడియాల చిన్నా, పబ్బినీడి పాపారావు, ఉబా శ్రీను, ధర్మారావు, విజయసారథి, బొడ్డు శ్రీను, భువన, ప్రసన్న, కర్రి చక్రధర్, అనుసూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాలు



కాకినాడలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమంలో కన్నబాబు తదితరులు

- ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకునేలా సంతకాలతో ఉద్యమం
- సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టిన మాజీ మంత్రి కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో కోటి సంతకాలు కార్యక్రమాన్ని సోమవారం ఆయన మొదటి తన సంతకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులకు గవర్నర్ పేరిట ముద్రించిన ప్రతులను అందజేసి సంతకాలు సేకరించారు. గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం ఏవిధంగా చేపట్టాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసి నిర్మాణం చేపట్టిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు దారాదత్తం చేస్తుందన్నారు. దీని వలన పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. ఫీజులు భరించలేనంతగా పెరుగుపోతాయని, ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులోకి లేకుండా పోతుందన్నారు. వైఎస్సార్ సీపీ కోటి సంతకాలు సేకరణ ద్వారా మెడికల్ కళాశాల శాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర గవర్నర్‌కు అందజేసేందుకు ఉద్యమంలో కార్యక్రమం చేపడతామన్నారు. అన్ని వర్గాలు భాగస్వాములవ్వాలని కోరారు. కొత్తగా మంజూరైన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వవద్దని, పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే నడపాలని, ప్రజా నిధులతో నిర్మించిన భవనాలు, ఆస్పత్రులు ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

బోట్‌క్లబ్: మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కాకినాడ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం ఉదయం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన చేశారు. ఈ నిరసనకు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మరణించిన, రిటైర్మెంట్ అయినా వారి స్థానంలో వారి కుటుంబీకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. పర్మినెంట్ కార్మికుల బకాయి డీఏలు తక్షణమే చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీని ప్రకటించి ఐఆర్ 30శాతం తక్షణమే ఇవ్వాలన్నారు. తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తరపున నవంబర్ 3వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు సమ్మె నోటీస్ అడిషనల్ కమిషనర్‌కు అందజేసినట్లు చెప్పారు. ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం మంజూరు చేయాలని, కాకినాడ స్పెషల్ శానిటేషన్ కార్మికులను, టాయిలెట్ కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేసి జీతాలు పెంచాలని, బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని, పర్మినెంట్ కార్మికుల ఎస్ఆర్‌లను త్వరితగతన పూర్తి చేయాలని, కమిషనర్ కార్యాలయంలో ఆడిటర్‌ను నియమించాలన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రైన్ కోట్స్, యూనిఫారం, ఎప్రాన్, గ్లౌజులు, పనిముట్లు కొరత తీర్చాలన్నారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అక్టోబర్ 13న సమ్మె నోటీసులు అందించాలని, గాంధీ విగ్రహాలకు సమస్యలతో కూడిన వినతులు అందజేయాలని, అక్టోబర్ 22న మున్సిపల్ కార్యాలయాలు ఎదుట ధర్నాలు నిర్వహించాలని, అక్టోబర్ 25వ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా వద్ద నుండి బైక్ ర్యాలీ ప్రారంభించాలని, అక్టోబర్ 27న ఆర్డీవో కార్యాలయం ముట్టడి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి మున్సిపల్ సమ్మె ప్రారంభమవుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొబ్బిలి ఈశ్వరరావు, ధనాల శ్రీనివాస్, బంగారు రాజేష్, నక్క లక్ష్మణరావు, సింగంపల్లి రమణ, నిమ్మకాయల ఈశ్వరరావు, తంగేళ్ల అప్పన్న పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం దుకాణాలు

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో విచ్చలవిడిగా మద్యం దుకాణాలు, ఇళ్లలో పేకాట క్లబ్‌లు ఎక్కువ కావడంతో కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గ డివిజన్లలో అసాంఘిక వాతావరణం నెలకొందని పౌర సంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. పదేళ్ల వారికి మద్యం అలవాటు దగ్గరవుతున్న దుస్థితి మంచిది కాదన్నారు. బహిరంగ మద్యపానం చేసే అలవాటును కట్టడి చేయకపోవడంతో గుడి, బడి, ఆసుపత్రి, పార్కు, మార్కెట్, అన్నా క్యాంటీన్, ప్రభుత్వ కార్యాలయాల తేడా లేకుండా ప్రతి బెల్ట్ షాపు నుంచి యథేచ్ఛగా బహిరంగ మద్యపానం చేయడం సీసాలు విసిరివేస్తున్నారన్నారు. రాత్రి వేళల్లో అత్యవసర పనులపై బయటకు రావాలంటే భయపడే దుస్థితి నెలకొందన్నారు. పూర్తి స్థాయిలో స్మార్ట్ సిటీ నిధులతో ఏర్పాటైన సీసీ కెమెరాల నిర్వహణ కమాండింగ్ సెంటర్ పర్యవేక్షణ కొరవడిన కారణంగా నగరం ప్రమాద కరంగా మారిందన్నారు. మద్యం అమ్మకాలు తగ్గించే ప్రయత్నం జరగాలని కోరారు. మద్యం ఆదాయంలో 50 శాతం మద్య విమోచన కేంద్రాల నిర్వహణకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

న్యాయమూర్తిపై దాడి బాధాకరం



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు

బోట్‌క్లబ్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి బాధాకరమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు అన్నారు. స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం దాడికి నిరసనగా ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తికే రక్షణ లేకపోతే ఎలాగని ప్రశ్నించారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ జరిపించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దీని వెనుక ఉన్న అసాంఘీక శక్తులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు సత్తిబాబు, ఏ రాజు, పలివెల నవీన్, ముప్పిడి శ్యామ్, అరసాల హరిబాబు, దివాకర్, పలివెల రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారం మరువలేనిది

- నగరపాలక సంస్థ కమిషనర్ భావన
- బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా బదిలీ
- భావనకు ఘనంగా వీడ్కోలు



కమిషనర్‌కు జ్ఞాపిక అందిస్తున్న కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు

బోట్‌క్లబ్: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా పని చేయడం ఎంతో సంతృప్తిగా ఉందని, ఉద్యోగులు, అధికారులు అందించిన సహకారం మర్చిపోలేనిదని కమిషనర్ భావన పేర్కొన్నారు. ఆమె బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయిన సందర్భంగా సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో వీడ్కోలు సభ నిర్వహించారు. అదనపు కమిషనర్ టీకే సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో భావన మాట్లాడుతూ కాకినాడ కార్పొరేషన్‌లో కమిషనర్‌గా 15 నెలలు పనిచేయడం చాలా సంతృప్తికరంగా ఉందన్నారు. ఉద్యోగులందరి సహకారంతో ఒత్తిడి లేకుండా బాధ్యతలను నిర్వర్తించగలిగానన్నారు. ప్రతి ఉద్యోగి తన విధి నిబద్ధతతో చేస్తే ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి పట్ల వ్యక్తిగతంగా కోపం లేదని, వృత్తి పరమైన క్రమశిక్షణ కోసం మాత్రమే కఠినంగా వ్యవహరించానని స్పష్టం చేశారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బంది కలిసి కమిషనర్‌ను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందించారు.

విద్యుత్ నగర్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమం



ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రముఖులు

బాలాజీచెరువు: స్థానిక విద్యుత్‌నగర్ చల్లా జగన్నాథ శాస్త్ర వేదికలో అస్వాదన సాహితి సమితి ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. అస్వాదన సాహితి సమితీ వ్యవస్థాపకులు గొట్టుముక్కల వెంకట సత్య నరసింహశాస్త్రి భాషకు ఉన్న అర్థాన్ని ఉన్నది ఉన్నట్టుగా చెప్పుకోవాంటూ భాగవతంలో ఉన్న పద్యాలను ఉదాహరించి చెప్పారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మద్దాలి కె.వి.వి.సత్యనారాయణమూర్తి వామన పురాణం చివరి భాగంలో వామన ఆవిర్భావం బలివృత్తాంతం, బాణసురిని కథను, యుగ ధర్మాల గురించి విపులంగా వివరించారు. ప్రతి ఆదివారం సాయంత్రం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జ్యోతి శాస్త్ర పండితులు డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, నేతి వెంకటరమణ, ఇంద్రగంటి నరసింహమూర్తి, బులుసు వేణుగోపాలరావు, శతవధాని పోచిన పెద్ది సుబ్రమ్మణ్యం, దీక్షితుల సుబ్రమ్మణ్యం, జొన్నలగడ్డ భాస్కరశర్మ, అకెళ్ల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి 16న కౌన్సెలింగ్

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 16వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ తెలిపారు.
ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం rmckakinada.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చక్రరావు, చిత్రంలో ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తదితరులు

కాకినాడ క్రైం: కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్) ఓ ప్రాణ రక్షణ ప్రక్రియ అని ఐఎస్ఏ రిసక్స్యేషన్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అధ్యక్షతన ఆర్ఎంసీలో సీపీఆర్ వారోత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రరావు వైద్య నిపుణులు, విద్యార్థులకు సీపీఆర్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. అనంతరం డాక్టర్ విష్ణువర్ధన్ సీపీఆర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ జీఎస్ ముఖర్జీ, డాక్టర్ ఎంవి ఆనంద్, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ప్రసన్నకుమార్, ప్రొఫెసర్లు వింధ్య, శాంతిశ్రీ, డాక్టర్ చిరంజీవి సహా వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

ఏఐబీఎస్‌ఎస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా దొరస్వామి నాయక్



దొరస్వామినాయక్ అభినందిస్తున్న సభ్యులు

బాలాజీచెరువు: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి కమిటీలో కోస్తాంధ్ర నుంచి ఉపాధ్యక్ష ఎన్నిక హోదాతోపాటు కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బీఆర్ దొరస్వామినాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ జేఎన్టీయూకే క్యాంపస్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో సోమవారం సాయంత్రం ఎన్నిక జరిగింది. జనరల్ సెక్రటరీగా బాణావత్ బాలు నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, ప్రొఫెసర్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ మాలోతు రమేష్ నాయక్ ప్రొఫెసర్ ఆఫ్ బయోటెక్నాలజీ, జనరల్ సెక్రటరీ రాంబాబు నాయక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్, ఆర్‌బీ నాయక్, మురళి నాయక్ ఇతర ప్రముఖ డిపార్ట్‌మెంట్‌ల ఉద్యోగులు హాజరయ్యారు. జిల్లాలో బంజారా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై చర్చతోపాటు విద్యాలయాల్లో వివక్షతకు గురవుతున్న వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల అమలు, తెలుగు రాష్ట్రాల్లోని బంజారాలను అవమానిస్తూ విమర్శించిన మైపతి అరుణకుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సిలని చర్చించారు.

రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే తగ్గే అవకాశం



స్త్రీవ్యాధి నిపుణురాలు మాధవిని సత్కరిస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: రొమ్ము క్యాన్సర్ మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే క్యాన్సర్‌లో ఒకటని, ఈ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు ఎక్కువని స్త్రీ వ్యాధి నిపుణురాలు అడబాల మాధవి అన్నారు. స్థానిక ఆత్మీయ ఆసుపత్రిలో ప్రపంచ రొమ్ము క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చంకలు, రొమ్ములో ఏమైనా గడ్డలు, వాపు ఆకారంలో మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యులని సంప్రదించాలన్నారు. 40 ఏళ్ల పైబడిన మహిళలు ప్రతి సంవత్సరం మామోగ్రామ్ పరీక్ష చేయించుకుంటే మంచిదన్నారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాధవిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీవల్లీ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సామర్లకోట: ఆన్‌లైన్ మోసాలతో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల బ్యాంకుల నుంచి రుణాలు ఇస్తామని, బహుమతులు వస్తాయని సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లకు దూరంగా ఉండాలన్నారు.

కలశాలతో అమ్మవారి ఊరేగింపు

బోట్‌క్లబ్: స్థానిక దుమ్ములపేటలో రాజీవ్‌గృహకల్ప వద్ద విజయ కనకదుర్గ ఆలయ 16వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. 108 మంది మహిళలు కలశాలతో అమ్మవారిని ఊరేగించారు. మందిర వ్యవస్థాపకులు పెంకె నూకరాజు మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మాణానికి కమిటీ కార్యాచరణ చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దామిశెట్టి రామ్మోహనరావు, పొన్నగంటి రామారావు, కొత్త పైడిరెడ్డి, బండారు వాసు, లోవ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

మిస్ కాకినాడ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కరుణ

బాలాజీచెరువు: ఆర్క్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఫాబిన్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మిస్ కాకినాడ అందాల పోటీల్లో ఆదిత్య మహిళ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. పోటీలు మూడు విభాగాల్లో నిర్వహించగా ద్వితీయ సంవత్సర విద్యార్థులు వై.మాన్య మొదటి రన్నర్‌గా, ఎం.గాయత్రి నాలుగో రన్నర్‌గా నిలిచారు. బహుమతులతోపాటు రూ.20వేలు నగదు బహుమతి సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను కళాశాల అవరణలో కార్యదర్శి ఎస్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ, వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీకాంత్, కల్చరల్ క్లబ్ నిర్వాహకులు సీహెచ్ దివ్యభారతి, షేక్ మరియమ్ రిజ్వానాలు పాల్గొన్నారు.